# రిజర్వేషన్లతోనా రాజకీయాలు?

జయప్రకాష్ నారాయణ్

**BB-24-April-2006**

(రచయిత లోక్‌సత్తా, 'ఓట్ ఇండియా'ల సమన్వయకర్త)

కేంద్ర విశ్వవిద్యాలయాల్లో, ప్రభుత్వ ఉన్నత విద్యాసంస్థల్లో 27 శాతం సీట్లను ఇతర వెనుకబడిన తరగతులకు కేటాయిస్తామని ప్రకటించడం ద్వారా కేంద్రమంత్రి అర్జున్‌సింగ్ రిజర్వేషన్లనే కందిరీగల తుట్టెను మరోసారి కదిపారు. వైద్య కళాశాలలు ప్రభుత్వం ఆధ్వర్యంలోనే పనిచేస్తున్నాయి కాబట్టి వాటిలోనూ ఈ రిజర్వేషన్లను వర్తింపజేస్తామంటూ ఆరోగ్యమంత్రి అన్బుమణి రామదాస్ ముందుకొచ్చారు. మంత్రుల ప్రకటనలు సమాజంలో ఓ వర్గానికి మోదం కలిగిస్తే, మరోవర్గానికి ఖేదం మిగిల్చాయి. ఐదు రాష్ట్రాలకు ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో మంత్రుల ప్రకటనల వెనుక గల మర్మమేమిటో హించడం కష్టం కాదు. రిజర్వేషన్లు నాయకులకు రాజకీయ లబ్ధిని చేకూర్చే సాధనాలుగా మారకూడదు. వాస్తవాల ఆధారంగా, తార్కిక దృక్పథంతో లోతుగా విశ్లేషించిన పిమ్మటే రిజర్వేషన్లపై ఓ నిర్ణయానికి రావాలని సూచిస్తున్న వ్యాసమిది.

కేంద్ర విద్యాసంస్థల్లో 27 శాతం సీట్లను ఇతర వెనకబడిన తరగతులకు ప్రత్యేకించాలన్న ఇటీవలి ప్రతిపాదన తీవ్రస్థాయి చర్చను రేకెత్తించింది. రిజర్వేషన్ కారణంగా ఒక సామాజికవర్గం నష్టపోతే మరో సామాజికవర్గం లాభపడుతుంది. దాంతో సమాజం నిలువునా చీలిపోతుంది. పక్షపాతం, ద్వేషభావనలతో కాకుండా వాస్తవాల ఆధారంగా తార్కిక దృక్పథంతో ఈ సమస్యపై చర్చ జరపాలి. నేపథ్యాన్ని పరిగణనలోకి తీసుకొని లోతుగా విశ్లేషించాలి.

## సమాన అవకాశాలు ఏవీ?

దీనిపై ఒక నిర్ణయానికి వచ్చేముందు మనం మూడు కీలక అంశాలను పరిశీలించాల్సిన అవసరం ఉంది. మొదటిది- నేటికి కూడా అనేక సందర్భాల్లో కులం, కుటుంబం, లింగాన్నిబట్టి శిశువు భవిష్యత్తు నిర్ణయమైపోతోంది. ప్రతిభా సామర్థ్యాలు, కృషి పట్టుదలలతో సంబంధంలేకుండా పుట్టుకే ప్రామాణికం కావడం ఆధునిక నాగరిక సమాజానికి ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదు. అణగారినవర్గాలకు చెందిన పేదపిల్లలు ఇతరుల్లాగే మంచి మేధస్సు, తెలివితేటలుగల వారే అయినా- వారి శక్తిసామర్థ్యాలకు తగిన అవకాశాలు లభించడం లేదు. ఫలితంగా మన సమాజంలోని మేధో సంపద వృథా అవుతోంది. అన్నివర్గాలూ లాభపడేలా సమసమాజంలోని ఆధునిక, మానవీయ దృక్పథంతో సకల సామాజిక వర్గాలకు సమాన అవకాశాలు కల్పిస్తేనే అధిక పెరుగుదలస్థాయి స్థిరంగా కొనసాగుతుంది. సమానత- సావకాశాలను పెంపొందించి, శాంతి- సామరస్యాలను పరిరక్షించడానికి గట్టి కార్యాచరణ విధానాలను రూపొందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. లేకపోతే సామాజిక న్యాయసాధనకు హింసే మార్గంగా మారుతుంది. సమానత, సామాజిక సామరస్యం అవిభాజ్యం.

రెండోది- సామాజిక న్యాయం, సావకాశాలు కల్పించే సందర్భంగా ప్రతిభాసామర్థ్యాల కోసం కూడా మనం అన్వేషించాలి. ఆధునిక సమాజంలో - ఆర్థిక, సేవ, పరిపాలన రంగాల్లో పురోగతి సాధ్యపడాలంటే సమర్థత, సరైన పనితీరు కీలకం. గొప్ప పనితీరు కోసం గట్టి కార్యాచరణ పథకాన్ని రూపొందించాల్సిన అవసరం ఉంది. మూడోది- గట్టి కార్యాచరణ విధానాలు లేకపోతే యువత సగౌరవంగా తలెత్తుకోలేదు. సరైన అవకాశాలూ పొందజాలదు. అవకతవకలు, అక్రమాలు ఎన్నయినా జరిగి ఉండవచ్చుగాక- రిజర్వేషన్ల వల్ల పెద్దసం

ఖ్యలో ప్రజానీకం లబ్ధిపొందిన మాట నిజం. అవకాశాలు లభించినప్పుడు వారిలో అనేకమంది మంచి పని తీరు కనపరిచారు. అదే సమయంలో, రిజర్వేషన్లవల్ల ప్రయోజనాలు అందరికీ సమానంగా చేకూరలేదు. ప్రత్యేక ప్రాధాన్యం పొంది పైకి ఎదిగిన కుటుంబాలు పేద, నిరక్షరాస్య కుటుంబాలకన్నా పైచేయి సాధించాయి.

ఈ సమస్య ఎంతో సంక్లిష్టమైనది పైగా వక్రీకరణలూ జరుగుతున్నాయి. దాంతో ఉభయ వర్గాల్లోనూ అసంతృప్తి నెలకొంది. కొద్దిమందికే ప్రయోజనం దక్కడం, విద్యా-ఉపాధి అవకాశాలు తగినంతగా లేకపోవడంతో మోసపోతున్నామని పేద ఎస్సీ, ఎస్టీ, ఒ.బి.సి.లు భావిస్తున్నారు. తమ పట్ల వివక్షణ చూపుతున్నారని, తమ అవకాశాలు తగ్గిపోతున్నాయని ఇతర వర్గాల్లోని పేదలు అభిప్రాయపడుతున్నారు. నాణ్యమైన చదువు కోసం ఎందరో అర్రులు చాస్తున్నారు. దాంతో ఉన్నతస్థాయి విద్యాసంస్థల్లో సీట్ల అందుబాటు, ఎంపిక ప్రక్రియ వివాదాస్పదమవుతున్నాయి.

సమర్ధతతోపాటు సమన్యాయాన్నీ పెంపొందించగలమా? ప్రతిభను, సామాజిక న్యాయాన్నీ ఒకే గాటన కట్టగలమా? అందరికీ లబ్ధి చేకూర్చేందుకు వీలుగా ప్రాధాన్య విధానాలను సవరించుకొనగలమా? ఈ సంశయాలకు సహేతుక సమాధానాలు సిద్ధంగానే ఉన్నాయి. విధానకర్తలు, సమాచార మాధ్యమాలు సంచలనాలకు పాల్పడే బదులు వాటిపై దృష్టిసారించాల్సిన అవసరం ఉంది. రాజకీయ ఉద్దేశాలు, సామాజిక వివక్షణ, ఆగ్రహావేశాలను విడనాడాలి. హేతుబద్ధంగా ఆలోచించాలి. వివేకంతో వ్యవహరించాలి. దీర్ఘకాలిక పరిష్కారాలే లక్ష్యం కావాలి. అందుకోసం మనం చేయవలసిందేమిటి? ఆయా వర్గాల వారికి మేలు చేకూర్చే ఉద్దేశంతో చేపట్టే విధానాల విషయంలో కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం మంచిది. ముఖ్యంగా వృత్తి విద్యాకోర్సులు, ఉన్నతస్థాయి విద్యాసంస్థల్లో ప్రమాణాలు మెరుగుపరచేందుకు ప్రోత్సాహకాలు ఇవ్వాలి. అణగారిన వర్గాల అభ్యర్థులకు అండదండలు అందజేయడం ద్వారా ఈ పని సాధించాలి. ఉదాహరణకు- జనరల్ అభ్యర్థులను చేర్చుకోవడానికి 90 శాతాన్ని కటాఫ్ స్కోరుగా తీసుకొంటే, ప్రాధాన్యవర్గాల అభ్యర్థుల విషయంలో దాన్ని 80 శాతానికి లేదా 75 శాతానికి పరిమితం చేయాలి. దానివల్ల ముందుకు దూసుకెళ్లేందుకు ఆ అభ్యర్థులకూ ప్రోత్సాహ ప్రోద్బలాలు లభిస్తాయి. ఒకేస్థాయిలో ఉన్నత ప్రమాణాలు సాధించడానికీ వీలవుతుంది. ఈ ప్రమాణాలను అందుకొనేందుకు వీలుగా ప్రాధాన్యవర్గాల అభ్యర్థులకు ప్లస్ టూ స్థాయిలో ఉచితంగా, విస్తృతంగా శిక్షణ ఇవ్వాలి. మరికొన్ని చర్యలూ చేపట్టాలి. ఆర్థిక పరిస్థితిని ప్రాధాన్యానికి ప్రాతిపదికగా తీసుకోవాలి. అణగారిన వర్గాల్లో- ప్రధానంగా అల్పాదాయ కుటుంబాలకు, ప్రభుత్వంలో లేదా వృత్తిగతంగా నిర్దిష్టస్థాయికి దిగువన ఉన్నవారికి రిజర్వేషన్లు కల్పించాలి. ఇతరవర్గాల్లో- పేద అభ్యర్థులకు ఉచిత విద్యాసదుపాయం కల్పించాలి. డబ్బు లేదన్న కారణంతో ఏ విద్యార్థికి ఉన్నత విద్య దక్కని పరిస్థితి రాకూడదు. ఉపకార వేతనాలు, తక్కువ వడ్డీపై రుణాలను వ్యవస్థీకృతం చేయాలి.

బీసీల రిజర్వేషన్లను హేతుబద్ధం చేయాల్సిన అవసరం ఉంది. పాతికేళ్ల నాటి మండల్ కమిషన్ నివేదికే నేటికీ ప్రామాణికం కావడం సరికాదు. ప్రాధాన్యం ఇవ్వాల్సిన వర్గాలను నిర్ధారించడానికి, ప్రత్యేక హక్కుల కల్పన కోసం అత్యంత వెనకబడిన (వృత్తి) వర్గాలను గుర్తించడానికి ఎప్పటికప్పుడు సర్వేలు, పునర్విభజన జరపాల్సిన ఆవశ్యకత ఉంది. నానాటికి వృద్ధి సాధిస్తున్న విశాల ఆర్థిక వ్యవస్థ అవసరాలకు అనుగుణంగా నియంత్రణలు తొలగించి, ఉన్నతవిద్యను విస్తరించాలి. లైసెన్సులు, నియంత్రణలకు బదులు గుర్తింపు, విద్యా

సంబంధ స్వేచ్ఛ, విలువ, పారదర్శకత కల్పిస్తే అవకాశాలు బాగా విస్తరిస్తాయి. ప్రామాణిక ఉన్నతవిద్యకు ఉన్న ప్రాధాన్యం దృష్ట్యా ప్రభుత్వ విద్యాసంస్థల ప్రమాణాలనూ గణనీయంగా మెరుగుపరచాలి.

## నాణ్యమైన విద్య తక్షణ అవసరం

పాఠశాల విద్య, ఆరోగ్య పరిరక్షణలే పరిపాలన వ్యవస్థకు మూలస్తంభాలు కావాలి. బ్రిటీష్ ప్రధాని టోనీ బ్లెయిర్- ప్రామాణిక విద్యను తన ప్రభుత్వ పరువు-ప్రతిష్ఠలు, మనుగడకు సంబంధించిన సమస్యగా తీసుకొన్నారు. టెక్సాస్ గవర్నర్‌గా పాఠశాల విద్యకు మెరుగులు దిద్దినందువల్లే జార్జిబుష్ 2000లో జరిగిన ఎన్నికల్లో అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. మనదేశంలో ప్రభుత్వ విధానాలు, రాజకీయ కార్యకలాపాలు, పరిపాలన వ్యవస్థలో విద్యకు ప్రాధాన్యమే లేదు. రిజర్వేషన్ల సమస్య తలెత్తినప్పుడు మాత్రమే రాజకీయ నాయకులు, సమాచార మాధ్యమాల దృష్టి విద్యారంగంపై పడుతుంది. అనేకమందికి అన్యాయం జరుగుతోందంటే- అందుకు మూలకారణం సామాజిక రంగాన్ని చక్కదిద్దడంలో ప్రభుత్వ వైఫల్యమే. కొంతమందికి ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చే బదులు అందరికీ నాణ్యమైన పాఠశాల విద్య అందజేయడం మంచిదని వాదించే వారున్నారు. ఈ విషయంలో ప్రభుత్వ ఘోరవైఫల్యానికి పేదలను, అణగారిన వర్గాలను బాధ్యులను చేయలేమని వారు గుర్తించాలి. ఇన్నాళ్లూ తీవ్ర నిర్లక్ష్యానికి గురైన వర్గాలవారు నాణ్యమైన విద్యకోసం, సదవకాశాల కోసం ఎదురుచూస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని పేద దళితులు సైతం నెలకు రూ. 200 చెల్లించి పిల్లాణ్ని కాన్వెంట్ చదువు చదివిస్తున్నారు. ఇన్నాళ్లూ నిర్లక్ష్యానికి గురైనవారికి ప్రాధాన్యం ఇవ్వడానికి తగిన విధానాలు రూపొందించాలి. అదేసమయంలో నాణ్యమైన విద్యనూ అందజేయాలి. ఇప్పుడు దేశానికి కావలసింది ఇదే. సమానతను, సామర్థ్యాన్ని జతపరిచే కార్యక్రమాలను రూపొందించాలి.